
# నల్లాటి పిల్ల

బస్సు బయలుదేరే ముందు వో అమ్మాయి యెక్కింది. అదిరింది. కళ్లు చెదిరిపోయేంత అందం. క్షణకాలం నన్ను నేను యెక్కడో ఆవిష్కరించుకున్నట్లుగా తలను పై కెగరేసి 'వహ్...' అని నాలో నేనే మాట్లాడుకున్నాను. నల్లటి నేరేడు పండులా నిగనిగ లాడుతోంది. బ్లాక్ బ్యూటీ. సూపర్ స్ట్రక్చర్. బ్లూ జీన్స్‌పై క్రీం కలర్ టీ షర్ట్ వేసుకుంది. ప్రపంచమంతా యేకమై నా అనాగరిక ప్రవర్తనను యీసడించుకున్నా సరే... ఆ పిల్ల నుంచి నా చూపులు మరల్చకూడదనిపించింది.

కూర్చోడానికి అనుకూలమైన చోటు యెతుకుతూ కళ్ళను అటూ యిటూ తిప్పుతోంది. ఆకళ్ళు మిలమిల లాడుతున్నాయి...



బస్సు దాదాపుగా ఖాళీగా వున్నప్పటికీ కిటికీ పక్క సీట్లు మాత్రం ఫుల్ అయిపోయాయి. నేనూ వో విండో సీట్లో కూర్చోనున్నాను. నా పక్క సీటు ఖాళీగానే వుంది. ఆపిల్లను పిలిచి నా పక్క సీటివ్వాలని పించింది. యింతలో ఆ అమ్మాయి నా ముందు కూర్చోనున్న మధ్య వయస్కుడితో...

"యేమండీ విండో పక్కన కూర్చునేందుకు చోటిస్తారా "అని అడిగింది.

అతను యేమనుకున్నాడో యేమో తెలియదు. మొత్తం సీటు ఆ అమ్మాయికే వదలిపెట్టి వేరేచోటికెళ్లి కూర్చున్నాడు. ఆ అమ్మాయి ఫర్వాలేదని చెబుతున్నా వినిపించనట్టు...

"అదృష్టముండాలి", నా బ్యాడ్ లక్‌ను నిందించుకున్నాను.

కిటికీల్లోంచి సాయంత్రం చల్లటి గాలి ఫోర్సుగా వచ్చి ముఖానికి తగులుతోంది. ఆ గాలి కంటే వేగంగా నాలోని ఆలోచనలు రేగుతున్నాయి...

'ఆలోచిస్తూ కూర్చోవడం యెందుకు... దండగ, పలకరిస్తే పోలా'? సందర్భం కోసం యెదురు చూస్తూ కూర్చున్నాను.

బస్సును జడ్చెర్ల దగ్గర టీ కోసం ఆపారు. యింత కంటే చక్కటి అవకాశం మళ్లీ రాదని నా అంతరాత్మ పోరుతోంది...

లేచి రెండడుగులు ముందుకేసి, "టీ తాగుతారా" అడిగాను.

వద్దన్నట్టు తలాడించింది. యిక నేను చేసేదేం లేక చరచరా కిందికి దిగి, టీ తాగి, సిగరెట్టు ముట్టించాను. అటు వైపు చూశాను. వొకటీ రెండు సార్లు ఆ కళ్ళు డైరెక్టుగా నా అంతరంగానికే కనెక్టు అయ్యాయి. అప్రయత్నంగా చిరునవ్వు నవ్వాను.

ఆ అమ్మాయి కూడా నవ్వింది.

టీ తాగిన తర్వాత, రెండు కింగ్ సిగరెట్లు తీసుకొని జేబులో వేసుకున్నాను. తర్వాత వో ఆపిల్ పండు కొని విండో దగ్గరకు వెళ్లి తీసుకోమని ఆమె కిచ్చాను.

ఆమె కృతజ్ఞపూర్వకంగా నవ్వి తీసుకుంది.

అందరూ తిరిగి బస్సు యెక్కడంతో నేనుకూడా బసెక్కి నాసీట్లో కూర్చున్నాను.

తలను కొంచెం వొంచి...

"మీ పేరు" అడిగాను.

"అనామికా చారుమజుందార్" చెప్పింది దర్పంగా.

"సరిగా వినిపించ లేదు" అన్నాను .

"వెనుక నుంచి యిబ్బంది పడుతూ మాట్లాడడం దేనికి. హాయిగా పక్కన కూర్చుని మాట్లాడవచ్చుగా" అన్నది.

'యేమైనా మగాళ్ల కంటే ఆడోళ్లే ధైర్యవంతులు' నాలో నేను అనుకుంటూ వచ్చి కూర్చున్నాను.

"యేంటీ మీలో మీరే మాట్లాడుకుంటున్నారు".

"యేం లేదు. మీ పేరేమిటా" అని వూహిస్తున్నాను.

"మీరు యెంత వూహించినా తెలుసుకోలేరు. నాపేరు అనామికా చారుమజుందార్"

చారుమజుందార్ అనే శబ్దం అమిత ఉత్సాహం కలిగింది నాకు.

"మీది కమ్యూనిస్టు ఫ్యామిలీనా?"

పక్కున నవ్వింది... "మీ ప్రశ్నకు సమాధానం బహుశా లేదను కుంటా".

"అంటే"?

"వోయీ విక్రమార్కా, మీ ప్రశ్నను దాటవేయడానికి నేనీ మాట అనడం లేదు. నేనెందుకు యిలా చెప్పానో నీ కర్థం కావాలంటే శ్రమ తెలియకుండా నే చెప్పే కథను సావధానంగా విను. నీ ప్రశ్నకు సమాధానం నువ్వు తెలుసుకో గలిగితే నాతల వేయి వ్రక్కలవు గాక.

* * *

అది 1966వ సంవత్సరం.

శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం యేజెన్సీ ప్రాంతంలోని వో గ్రామంలో అనఘ అనే టీచర్ పని చేస్తుండేది. ఆమె పుట్టినూరు అక్కడి పాలకొండ గ్రామమే. జాతపు జాతి గిరిజన స్త్రీ. జాతపు జాతి స్త్రీలలో మొట్టమొదటి మహిళా టీచరు ఆమేనని అక్కడి వారు అంటుంటారు. ఆమె కుటుంబీకులు అందరూ అడవి తల్లి వొడిలో పుట్టి పెరిగిన వారే.

అక్కడ దొరికింది తింటూ... అప్పుడప్పుడు పోడు వ్యవసాయాన్ని చేసుకుంటూ గడిపే వారు. (పోడు వ్యవసాయం అంటే- ముందుగా అడవిని నరికి దాన్ని అంటిస్తారు. తరువాత చేతి గునపంతో గానీ, చిన్న కొడవలితో గానీ చిన్న చిన్న బొరియలు చేసి, వాటిల్లో విత్తనాలు నాటుతారు. వానలు పడగానే అవి మొలకెత్తుతాయి. పంట పండాక దానిని కోసుకుంటారు. అలా వాడిన భూమిని తిరిగి సారవంతం అయే వరకు సాగు చేయకుండా వదిలేస్తారు. ఈ వదిలేసిన భూమిలో తిరిగి అడవి పెరుగుతుంది. దీనినే పోడు అంటారు.) అయితే రాను రాను అటవీ రక్షణ నిబంధనలు కారణంగా అడవిలో దొరికే చిన్న చిన్న వస్తువులూ, అమ్ముకునేందుకు కట్టెలు కూడా వాళ్లకు కరవయ్యాయి. వడ్డీ వ్యాపారస్థుల వుచ్చుల్లో వాళ్లు సులభంగానే చిక్కుకున్నారు. చివరికి భూమిలేని కూలీలుగా మారిపోయారు. దాదాపు అక్కడి ప్రతి కుటుంబం చరిత్ర కూడా యించు మించుగా యిలాగే వుంటుంది.

భూస్వాముల, వడ్డీ వ్యాపారస్థుల దోపిడీ రాను రాను మితి మీరి పోవడంతో వారి అక్రమ వసూళ్లనూ, తక్కువ కూలి యిచ్చి యెక్కువ పని చేయిం



2

చుకొనే వారి నైజాన్ని గిరిజనులు వ్యతిరేకరించారు. దాదాపు పదేళ్లు యీ పోరాటాన్ని కొనసాగించారు. భూస్వాముల జులుంగానీ, పోలీసుల బెదిరింపులు గానీ తీవ్ర మవుతున్న గిరిజన పోరాటపు వెల్లువను ఆపలేక పోయాయి. చివరికి అదే యేడు కూలీ రేట్లు పెంచక తప్పలేదు. యీ వుద్యమం చివరి దశలో అనగ గిరిజనుల్ని సమీకరించడానికి చాలా శ్రమ పడింది.

* * *

"గిరికా ఆలస్యమైయిందేంటీ" అడిగింది అనఘ.

"పోలీసుల గస్తీ పెరిగింది. పైగా 200 తండాలలో 144 సెక్షన్ కూడా పెట్టారు. మరో వైపు భూస్వాములు కూడా మన కదలికలపై కన్నేసి వుంచారు. నిన్న మొన్నటి వరకు గడగడలాడిన భూస్వాములు తిరిగి పోలీసుల అండతో బలం పుంజుకుంటున్నారు. మనవాళ్లపై వారి దౌర్జన్యాలు, అత్యాచారాలు మళ్లీ మొదలవుతున్నాయి."

"యింతకూ మీటింగ్ విషయం మన వాళ్లతో మాట్లాడావా? లేదా?"

"మాట్లాడాను. యిప్పుడు మీటింగ్ పెట్టుకోవడం కష్టమేనని మనోలందరూ నీతో చెప్పమన్నారు. రెన్నెళ్లు ఆగిన తర్వాత చూద్దామన్నారు."

"అదే మంచిదనుకుంటా" అనఘ కూడా అందుకు యేకీభవించింది.

గిరిక వెళ్లిపోయిన తర్వాత యిక్కడి గిరిజన సంఘంతో ఆ విషయం చర్చించింది. చివరికి అక్టోబర్ 31న మొండెకల్‌లో మీటింగ్ పెడుదామని నిర్ణయించుకున్నారు.

మొండెకల్‌లో సమావేశం జరుగుతోంది...

సావుకార్లు, వడ్డీల పేరుతో అక్రమంగా ఆక్రమించుకున్న భూమిని తిరిగి పొందేందుకు సమైక్యంగా పోరాడాలని నాయకులు ఉపన్యసిస్తున్నారు. యీలోగా సభకు హాజరైన జనంలో వొక్కపెట్టున అరుపులు, కేకలు మిన్నునంటాయి.

మీటింగ్‌కు వస్తున్న యిద్దరు గిరిజనుల్ని లెవిడీ దగ్గర భూస్వాముల మనుషులు తుపాకులతో కాల్చి చంపారన్న వార్త దావానలంలా ప్రవహించింది. మీటింగ్ అర్థాంతరంగా ఆగిపోయింది. కొందరు గిరిజనులు లెవిడీ వైపుకు పరుగుదీశారు.

వారం రోజుల తర్వాత...

అనఘ, గిరిక, మరో యిద్దరు కామ్రేడ్లు సమావేశమయ్యారు.

"మనాళ్ల చేతిలో ఆయుధాలు వుండి వున్నట్లయితే మనం యిద్దర్ని పోగొట్టుకునే వాళ్లమే కాదు. దానికి బదులుగా భూస్వాముల అండగా వున్న మనుషుల శరీరాలు తెగిపడుండేవి. యిప్పటికైనా మించి పోయిందేమీలేదు. వాళ్లను మట్టు పెట్టాల్సిందే" అన్నాడో కామ్రేడ్.

"మనోళ్లు చాలా మంది యిందుకు వొప్పుకోకపోవచ్చు. హింసను వ్యతిరేకిస్తున్నారు" అన్నాడు మరో కామ్రేడ్.

"మనోళ్లని పొట్టన పెట్టుకున్నప్పుడు ఆ హింస కన్పించలేదేమో" గిరిక విసవిసలాడింది.

అనఘ యేం మాట్లాడలేదు. వాళ్ల మాటల్ని వింటూ దీర్ఘాలోచనలో పడింది.

ఇది జరిగిన మూడేళ్లకు అక్కడో భూస్వామి హత్య జరిగింది.

ఆ భూస్వామిని హత్య చేసిన నలుగురిలో అనఘ కూడా వొక్కటి.

* * *

వో రోజు అనఘను కలిశాడో వ్యక్తి. అతను సంఘమోళ్లు పంపితే వచ్చాడు.

"అనఘా యెంత చెప్పినా వినిపించుకోవేం. యీ పరిస్థితుల్లో నువ్వు పెళ్లి చేసుకోవడం మంచిది".

"పెళ్లి అనేది నా యిష్టాయిష్టాలకు సంబంధించింది. యిందులో యితరుల జోక్యం నాకు నచ్చదు. నన్ను యిబ్బంది పెట్టకండి."

"అక్కడే నువ్వు పొరపడుతున్నావ్. సొంత విషయం యెలా అవుతుంది. నువ్వు ప్రజల కోసం పని చేస్తున్నావ్. వాళ్లకు మార్గ దర్శికంగా వుండాలి నువ్వు. అంతేకాని పదిమందిలో నవ్వుల పాలు కాకూడదు. పెళ్లి కాకుండానే తల్లివి కాబోతున్నావని తెలిస్తే చాలా చులకనగా చూస్తారు. విప్లవ పోరాటానికి ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన మనం ప్రజల దృష్టిలో చులకన అయితే మన ధ్యేయం దెబ్బతినే అవకాశాలున్నాయి..." అంటూ చాలా సేపు మాట్లాడాడు.


**మొండెకల్‌లో సమావేశం జరుగుతోంది...**

**సావుకార్లు, వడ్డీల పేరుతో అక్రమంగా ఆక్రమించుకున్న భూమిని తిరిగి పొందేందుకు సమైక్యంగా పోరాడాలని నాయకులు ఉపన్యసిస్తున్నారు. యీలోగా సభకు హాజరైన జనంలో వొక్కపెట్టున అరుపులు, కేకలు మిన్నునంటాయి.**

**మీటింగ్‌కు వస్తున్న యిద్దరు గిరిజనుల్ని లెవిడీ దగ్గర భూస్వాముల మనుషులు తుపాకులతో కాల్చి చంపారన్న వార్త దావానలంలా ప్రవహించింది. మీటింగ్ అర్థాంతరంగా ఆగిపోయింది. కొందరు గిరిజనులు లెవిడీ వైపుకు పరుగుదీశారు.**


"మన దేశంలో ప్రధానంగా అత్యధిక జనాభా గ్రామాల్లో నివసిస్తున్నారని, అందువల్ల భూస్వామ్య వర్గాల ఆధిపత్యాన్ని నాశనం చేయాలని, వారి వద్దనున్న భూముల్ని లాక్కొని పేదలకు పంచాలనుకున్నాం. అయితే భూస్వాముల వద్దనుంచి భూముల్ని లాక్కుంటే వాళ్లేమి చేతకాని వాళ్లలాగా కూర్చోరు కాబట్టి సాయుధ పోరాటం చేయాలని నిర్ణయించుకున్న రోజు మన వెంట వున్న వారి సంఖ్యను లెక్కించడానికి కనీసం వేళ్ల అవసరం కూడా రాలేదు. చాలా మంది మన ఆలోచనా ధోరణిని వ్యతిరేకరించారు. అందరూ వ్యతిరేకిస్తున్నారని మన ధోరణిని మార్చుకున్నామా? వో కొత్త ఆలోచనా ధోరణి మొట్టమొదట మైనారిటీతోనే ప్రారంభమవుతుంది. తర్వాతే దానికి లీగాలిటీ లభించే అవకాశాలు ఉంటాయి.

తరతరాలుగా స్త్రీ దోపిడీకి, వివక్షకు గురవుతోంది. యిప్పుడున్నటువంటి వివాహ వ్యవస్థ యీ దోపిడిని బాహాటంగానే సమర్థిస్తోంది.

ప్రాచీన సమాజంలో కుటుంబ వ్యవస్థ లేదు. కనుక సొంత ఆస్తి పద్ధతి, రాజ్యాంగం కూడా లేవు. యెప్పుడైతే కుటుంబ వ్యవస్థ యేర్పడిందో దానితో పాటూ సొంత ఆస్తి, రాజ్యాంగ వ్యవస్థ యేర్పడాయి. యెందుకంటే యీ మూడు వొకదాని మీద వొకటి ఆధారపడుతాయి కనుక. అయితే మనం కేవలం భూపోరాటాలకు మాత్రమే పరిమితమయ్యాం.

సకల జీవన రంగాల్లో విస్పోటనం జరిగినప్పుడే విప్లవం విజయవంతం అవుతుంది. అయితే మన వాళ్లు యీ సకల ఉద్యమాల్లో ఆస్తి సమస్య ప్రధాన సమస్యగా ముందుకు తెస్తున్నారు. ప్రస్తుతం దీనితో పాటు మిగిలిన విషయాల్లో శ్రద్ధ చూపించాల్సిన సమయం ఆసన్నమైంది. ముఖ్యంగా కుటుంబ వ్యవస్థ పైన.

స్త్రీ, పురుషుల మధ్య అసమానత్వాన్ని సృష్టిస్తున్న యీ వివాహవ్యవస్థను నేను వ్యతిరేకిస్తున్నాను."

అనఘ మాటలకు సమాధానంగా అతను వొక్క మాట కూడా మాట్లాడలేక పోయాడు. కొంత సేపు అలాగే కూర్చున్నాడు. అటుతర్వాత యేమనుకున్నాడో యేమో అతను లేచి మౌనంగా వెళ్లిపోయాడు.

యిది జరిగిన కొన్నాళ్ళకు అనఘను పార్టీ నుంచి బహిష్కరించారు.

* * *

"హల్లో బోరు కొడుతోందా" అంటూ నా ముఖాన్ని పరిశీలనగా చూసింది అనామికా చారుమజుందార్.

"లేదు, లేదు" చెప్పండి.

"ఆ అనఘ కూతుర్నే నేను."

"ఆ విషయం మీరు కథ చెబుతున్నప్పుడే వూహించాను. యింతకూ మీ నాన్న యెవరో నీకు తెలుసా?"

"తెలియదు."

"తెలుసుకోవాలని మీకు అనిపించలేదా?"

"చిన్నప్పుడు తెలుసుకోవాలని చాలా సార్లు మారాం చేశాను. అయినా అమ్మ సమాధానం చెప్పేది కాదు. నేను పెద్దయేకొద్ది మా అమ్మ జీవితంలోని కొన్ని సంఘటనలు తెలిసాయి. దాంతో అడగడం మానేశాను. యిప్పుడు మా అమ్మ ను యెవరైనా ఆ విషయం అడిగితే యేమంటుందో తెలుసా - అదో అనవసరమైన సమాచారం తప్ప మరేం కాదని అంటుంది.

అవును యింతకూ మీ సందేహానికి సమాధానం దొరికిందా విక్రమార్కా"

నేనేం చెప్పలేక పోయాను. బస్సు అనంతంలోకి వెళుతున్నట్టుగా వుంది.

నన్ను ముసిరిన ఆలోచనలు వదిలేటట్టు కన్పించడం లేదు...

**- మారసాని విజయ్ బాబు**